# అభివృద్ధి వైపే సూర్యాపేట జనం

- సీఎం కేసీఆర్ హామీలపై చర్చలు
- మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితోనే ప్రగతి సాధ్యమంటున్న అన్ని వర్గాలు
- జగదీశ్‌రెడ్డికి ఉన్నత స్థానంతో పాటు పారిశ్రామిక వాడ, డ్రైపోర్ట్ ఏర్పాటుపై హర్షం
- వ్యాపారులు, యువతలో వెల్లువెత్తుతున్న ఉత్సాహం
- బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీ ఖాయమైనట్లేనంటున్న రాజకీయ విశ్లేషకులు
- జగదీశ్‌రెడ్డికి 50 వేల మెజారిటీ వస్తుందని మొదలైన బెట్టింగులు

సూర్యాపేట, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలో మంగళవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభతో నియోజక వర్గ ప్రజల పొలిటికల్ మూడ్ పూర్తిగా బీఆర్ఎస్ వైపు మారింది. సభకు సుమారు లక్ష మందికి పైనే జనం హాజరు కావడంతో మంత్రి జగదీశ్‌రెడ్డి మెజారిటీ గెలుపు ఫిక్స్ అయిపోయినట్లుగా అంతా భావిస్తున్నారు. తొమ్మిదిన్నరేండ్లలో కోట్లాది నిధులు తెచ్చి సూర్యాపేటను అగ్రగామిగా నిలుపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డికి మళ్లీ ఉన్నత స్థానమే అని సీఎం కేసీఆర్ ప్రకటించి మెజార్టీని ఫిక్స్ చేసినట్లు రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. సీఎం ప్రకటన పట్ల నియోజక వర్గ పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులే కాకుండా సాధారణ ప్రజలు సైతం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ తూ.చ తప్పకుండా అమలు చేసినందున ఈసారి ఐటీ హబ్, పారిశ్రామిక వాడ, డ్రైపోర్ట్‌తో పాటు టూరిజం సర్క్యూట్‌కు సీఎం ఓకే చెప్పడం పట్ల సర్వత్రా చర్చ వినిపిస్తున్నది. గతంలో ఎన్నడూ చూడని విధంగా సూర్యాపేట అభివృద్ధి ఓవైపు కండ్ల ముందే కనిపిస్తుండగా మరోవైపు సీఎం కేసీఆర్ స్వయంగా ప్రజా ఆశీర్వాద సభలో సూర్యాపేట అభివృద్ధికి ఇచ్చిన హామీలతో జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో 50 వేలకు పైనే మెజార్టీతో సాధిస్తారంటూ బెట్టింగ్‌రాయుళ్లు పందేలు సైతం కాస్తున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో సూర్యాపేటను అభివృద్ధి చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్న సీఎం కేసీఆర్ మాటలు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల్లో నూతన ఉత్సాహం నింపాయి. జగదీశ్‌రెడ్డిని మరోసారి మంత్రిని చేస్తానని, ఖచ్చితంగా ఉన్నత స్థానంలోనే ఉంటారని సీఎం సభాముఖంగా హామీ ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణులు, నియోజక వర్గ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మంచి నాయకుడిని జారవిడుచుకోవద్దంటూ మంత్రి గురించి సీఎం చెప్పిన మాటలు పార్టీ క్యాడర్‌లో ఉన్న చిన్నచిన్న అసంతృప్తులను పటాపంచలు చేయడంతో పాటు అటుఇటు ఆలోచిస్తున్న ఓటర్లను కూడా ఏకం చేస్తున్నాయంటున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి సూర్యాపేటలో రైడీయిజం, గుండాయిజం, చందాలు, దందాలు, దౌర్జన్యాలు లేకుండా చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి ద్వారానే మరింత అభివృద్ధి జరుగుతుందనే అభిప్రాయం ప్రజల్లో మెండుగా కనిపిస్తున్నది. సూర్యాపేట ప్రజలకు మూసీ మురికి నీళ్లు తాగించిన కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనను గుర్తు చేసుకుంటున్న జనం జగదీశ్‌రెడ్డికి మించిన అభ్యర్థి లేడన్న ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సర్వేలో సైతం స్పష్టమవుతున్నది.

### 73 సభలు జరిగితే మంత్రి జగదీశ్‌రెడ్డికి మాత్రమే హామీ

సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 73 ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. అయితే ఈ అన్ని ప్రాంతాల్లో ఉన్నత స్థానం హామీ మాత్రం మంత్రి జగదీశ్‌రెడ్డికి మాత్రమే దక్కింది. దాంతో తర్వలో ఏర్పడబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రికి ఉండబోయే ప్రాధాన్యత ఎంతనేది తేలిపోయింది. దాంతో వివిధ కారణాల వల్ల లోలోపల అసంతృప్తిగా ఉన్న బీఆర్ఎస్ నేతలు కూడా మనసు మార్చుకున్నారు. జగదీశ్‌రెడ్డికి అండగా ఉంటేనే రేపు తమకూ భవిష్యత్ ఉంటుంది. లేకుంటే అన్ని విధాలా నష్టమే జరుగుతుందనే అభిప్రాయానికి వస్తున్నారు. ఎవరి స్థాయిలో వారు ముమ్మర ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను, మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ఓటర్లకు వివరిస్తూ ప్రచారంలో బిజీ అయ్యారు. కార్యకర్తల్లో సైతం గెలిచిపోయామన్న ధీమా కనిపిస్తున్నది. భారీ మెజార్టీ లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు.

### చర్చంతా సీఎం కేసీఆర్ హామీలపైనే..

సూర్యాపేట అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలపై ఎటు వెళ్లినా అదే చర్చ వినిపిస్తున్నది. జగదీశ్‌రెడ్డి మళ్లీ గెలిస్తే మంత్రి కావడం ఖాయమని తేలడంతో సూర్యాపేటకు మరిన్ని నిధులు వస్తాయన్న ఆశ అటు పార్టీ శ్రేణులు, ఇటు ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఐటీ హబ్, పారిశ్రామిక వాడ, డ్రైపోర్ట్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ ఓకే చెప్పడంతో వ్యాపారులు, యువతలో ఉత్సాహం పెరిగింది. స్థానికంగానే సుమారు 13 వేల మందికి ఉపాధినిచ్చే హామీలను మంత్రి జగదీశ్‌రెడ్డి కోరడం, సీఎం కేసీఆర్ సరేననడంతో యువతలో ఉత్సాహం వెల్లువెత్తుతున్నది. వ్యాపారాలు మరింత వృద్ధి చెందుతాయన్న ఆశ వ్యాపారుల ముఖంలో చిరునవ్వులు పూయిస్తున్నది. మంత్రి జగదీశ్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటే సూర్యాపేటకు మరోసారి భారీగా నిధులు రావడం ఖాయమని జనం పేర్కొంటున్నారు.

# ప్రజా ఆశీర్వాదమే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష

- ప్రజల్లో ఉన్న ప్రేమ, ఆదరణే మా బలం
- సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమమే మా ఆయుధాలు
- కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మితే పదేండ్లు వెనక్కి
- బీఆర్ఎస్‌కు పట్టం కడితే మరింత అభివృద్ధి
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో ఆటో డ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనం



ఆటో డ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

సూర్యాపేట టౌన్, నవంబర్ 22 : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పదేండ్లుగా కొనసాగుతున్న నిరంతర అభివృద్ధి, సంక్షేమాన్ని ఆస్వాదిస్తున్న అన్ని రంగాల ప్రజల ఆశీర్వాదమే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అరవయేండ్ల పాలనను ఎండగట్టి అభివృద్ధికి చిరునామాగా మారిన గులాబీ జెండాపై ప్రజలో గుండెల్లో పెంచుకున్న ప్రేమ, ఆదరణే తమ బలం, బలగమని తెలిపారు. సీఎం కేసీఆర్ సూర్యాపేటలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆటో డ్రైవర్ల పట్ల వరాలు కురిపించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్లు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి తమ సంపూర్ణ మద్దతును బీఆర్ఎస్ పార్టీకి ప్రకటించారు. అంతకుముందు వేలాదిగా ఆటో డ్రైవర్లు, కార్మికులు ప్రధాన వీదుల్లో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక కర్నల్ సంతోశ్‌బాబు చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి ప్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకుని మంత్రి జగదీశ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లు పాలించి ఆగం చేసింది కాక.. పదేండ్లు గడిచింది మరిచిపోతారులే అనుకుని ఇప్పుడేదో కొత్తగా చేస్తామంటూ నెరవేర్చలేని హామీలతో తిరుగుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులను ప్రజలు జోకర్లుగానే భావిస్తున్నట్లు తెలిపారు. వాళ్ల మాయమాటలు నమ్మి మోసపోతే మళ్లీ పదేండ్లు అభివృద్ధిలో వెనుకపడతామనే విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. సూర్యాపేట అభివృద్ధి 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వేసిన ఓటుతోనే మారిందన్నారు. అన్ని విధాలుగా దోచుకున్న కాంగ్రెస్, బీజేపీ కావాలా? నిరంతరం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పాలన కావాలా ఆలోచించి ఓటేయాలని మంత్రి కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, నాయకులు నంద్యాల దయాకర్‌రెడ్డి, డాక్టర్ రామ్మూర్తియాదవ్, మొరిశెట్టి శ్రీను, గండూరి ప్రకాశ్, అనుములపురి రవిబాబు గండూరి రమేశ్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఆటో డ్రైవర్లు

### బీఆర్ఎస్‌లోకి వలసల జోరు

సూర్యాపేటటౌన్, నవంబర్ 22 : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ భారీ సక్సెస్‌తో సూర్యాపేటలో పింక్ వేక్ వేగం పుంచుకున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీశ్‌రెడ్డి గెలుపు ఖాయం అవడంతో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల నుంచి వలసలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు క్షణికావేశంలో పార్టీని వీడిన వారంతా సొంత గూటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఒక్కరోజే 38వ వార్డు కౌన్సిలర్ గండూరి రాధికారమేశ్, 15వ వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ తిరిగి పార్టీలో చేరగా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అనుములపురి పరంధాములు కుమారుడు డాక్టర్ రవిబాబు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు మరో సీనియర్ నాయకుడు పోలగోని కృష్ణ, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకున్నారు. అలాగే పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి గార్లపాటి మమతారెడ్డి, పాలకుర్తి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడి సోదరుడు కోటగిరి జగదీశ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. ఆత్మకూర్.ఎస్ మండలం కందగట్ల, సూర్యాపేట రూరల్ మండలం టేకుమట్లకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆయా పార్టీలను వీడి బీఆర్ఎస్‌లో చేరగా వారందరికీ మంత్రి జగదీశ్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

### దామోదర్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం : డాక్టర్ రవిబాబు

కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్‌రెడ్డి సూర్యాపేట అభివృద్ధికి చేసింది శూన్యమని డాక్టర్ అనుములపురి రవిబాబు అన్నారు. మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సూర్యాపేటను నందనవనం చేసింది మంత్రి జగదీశ్‌రెడ్డి అని కొనియాడారు. సూర్యాపేటలో కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ సిండికేట్, మాఫియాదే రాజ్యమన్నారు. గాంధీ, ఉస్మానియా తర్వాత స్థానం సూర్యాపేట మెడికల్ కళాశాలదే అని తెలిపారు. కాంగ్రెస్ బీజేపీతో ఒరిగిందేమి లేదన్న ఆయన నిత్యం అభివృద్ధిని కాంక్షించే మంత్రి జగదీశ్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచి సూర్యాపేట అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

### బీఆర్ఎస్‌లోకి మరికొందరు కౌన్సిలర్లు..

సూర్యాపేట పట్టణానికి చెందిన మరికొందరు కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీజేపీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈ మేరకు ఇప్పటికే మంతనాలు పూర్తి అయ్యాయి. సీఎం సభ సక్సెస్ కావడం, ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ప్రజల నుంచి ఆదరణ లభించకపోవడం చూసిన నేతలు మరోసారి జగదీశ్‌రెడ్డి గెలువడం ఖాయంగా భావించి బీఆర్ఎస్ వనంలోకి వచ్చేందుకు క్యూ కడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పోలింగ్ తేదీ నాటికి సూర్యాపేట నియోజక వర్గంలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలు ఖాళీ కావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించుకుంటాం

- బీఆర్ఎస్ దివ్యాంగుల విభాగం రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి



ఏపూరులో ప్రచారం చేస్తున్న దివ్యాంగుల విభాగం రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి

ఆత్మకూర్.ఎస్, నవంబర్ 22 : దివ్యాంగులను ఆదరించి అక్కున చేర్చుకున్న మంత్రి జగదీశ్‌రెడ్డిని దివ్యాంగుల కుటుంబాలంతా ఏకమై అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాయని బీఆర్ఎస్ దివ్యాంగ విభాగం రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి తెలిపారు. మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని బొప్పారం, ఏపూరు, మిడతనపల్లి, శెట్టిగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పెన్షన్ రూ.6,016 కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లయ్య, నరేశ్, రేణుక, వెంకటేశ్వర్లు, లక్ష్మి, ఉప్పలయ్య పాల్గొన్నారు.

# మాచారంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

- నేడు హాజరు కానున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, నవంబర్ 22 : మండలంలోని మాచారం గ్రామంలో దేవాతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సీతారామ చంద్రస్వామి, కీర్తి ధ్వజ, ఆంజనేయ, నవగ్రహ శిఖర, గణపతి, సుబ్రమణ్యస్వామి, రాధాసమేత కృష్ణ, ముత్యాలమ్మ, పోతురాజు దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. గురువారం అంగరంగ వైభవంగా నూతన ఆలయాల్లో దేవతామూర్తులను ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమానికి మంత్రి జగదీశ్‌రెడ్డితో పాలు ప్రముఖులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి దేవాలయం